నమస్తే తెలంగాణ

హైదరాబాద్, శనివారం, 11 జనవరి 2025
SATURDAY, JANUARY 11, 2025

స్వర్ణగిరిలో మాజీ మంత్రి తలసాని పూజలు

స్వర్ణగిరిలో పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

భువనగిరికలెక్టరేట్, జనవరి 10 : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పట్టణంలోని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన వెంట గుండెబోయిన అయోధ్య యాదవ్, కొత్తపల్లి ఆనంద్‌యాదవ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య

భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఈఓ తీరు

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, జనవరి 10: లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి వేడుకల్లో భక్తులను కాకుండా వీఐపీలను, ఆయన సంబంధికులకే ఈఓ ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య విమర్శించారు. శుక్రవారం ఆయన వంగపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి రోజున గతంలో ఎప్పుడైనా భక్తులకు అనుకూలంగా నిర్వహించేవారని, వారికి అనువుగా మాఢ వీధుల్లో ఏర్పాట్లు చేయగా భక్తులు కూర్చునేవారని, కానీ ఇప్పుడు ఈఓ భాస్కర్‌రావు గ్యాలరీలు ఏర్పాటు చేసి కుర్చీలు వేయడంతో భక్తులు అటువైపు వెళ్లకపోవడంతో అవి ఖాళీగా ఉన్నాయన్నారు. ఈఓ అత్యుత్సాహం కారణంగానే యాదగిరిగుట్ట క్షేత్రంలో జరిగిన వైకుంఠ ఏకాదశి వేడుకలకు భక్తుల రాక తగ్గిందని ఆరోపించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వైకుంఠ ఏకాదశి రోజు ఇచ్చిన ప్రాధాన్యత భక్తులకు ఇవ్వలేదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని ఈఓ ప్రవర్తించాలి కానీ అధికార పార్టీ ఎమ్మెల్యేకు సేవ చేసే విధంగా వ్యవహరించడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు కసావు శ్రీనివాస్, మిట్ట వెంకటయ్య, తోటకూరి బీరయ్య, బైరోజు వెంకటాచారి, పన్నాల అంజిరెడ్డి, వెంకటరామిరెడ్డి, ఆరె స్వామి, కవిడే మహేందర్, చంద్రగాని జహంగీర్‌గౌడ్, రేపాక స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ

ఎమ్మెల్యే పదవికి బీర్ల రాజీనామా చేయాలి

- ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతను విమర్శిస్తే ఖబడ్దార్
- బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ

మోటకొండూర్, జనవరి 10 : కొలనుపాకలో బీర్ల అయిలయ్య భూకబ్జాకు పాల్పడినట్లు పూర్తి ఆధారాలున్నాయని, ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి ఎగ్గిడి కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ కబ్జాకి పాల్పడడమే కాకుండా ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని విమర్శించడం సరికాదని, గొంగిడి దంపతుల జోలికొస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే భూ కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆధారాలు బయట పెడుతున్నారని, అవినీతి జరుగకపోతే సబ్ రిజిస్ట్రార్ ఎందుకు సస్పెండ్ అయ్యారో ఆ పార్టీ నాయకులే చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, కో ఆప్షన్ మాజీ సభ్యుడు బురాన్, నాయకులు మల్గ వెంకటేశ్, దడిగే మధు, లక్ష్మీనారాయణ, బొట్ల ప్రశాంత్, ఎల్లేందర్, బాలకృష్ణ ఉన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భీమ్‌సింగ్

బొమ్మలరామారం : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్

బొమ్మలరామారం, జనవరి 10 : గ్రామీణ ప్రాంత విద్యార్థులు కళాశాల విద్యలో రాణించాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భీమ్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకుల హాజరు నమోదు, టీచింగ్ డైరీలను, కళాశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భీమ్‌సింగ్ మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం) : అంజయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), జనవరి 10 : మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాగిర్ అంజయ్యగౌడ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో అందించిన రూ.10వేలను స్థానిక బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాస కవిత, నాయకులు ఇంద్రారెడ్డి, ధనలక్ష్మి, అరుణ, సత్యనారాయణ, అజీమ్, అబ్బసాయిలుపాల్గొన్నారు.

లారీ కింద పడి మహిళ మృతి

సుభద్ర (ఫైల్)

రామన్నపేట, జనవరి 10 : మండల కేంద్రంలో లారీ కింద పడి శుక్రవారం మహిళ మృతి చెందినది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన జిల్లాల వెంకటేశం–సుభద్ర(49) భార్యాభర్తలు. వ్యక్తిగత పని నిమిత్తం ఇద్దరూ కలిసి బైక్‌పై శుక్రవారం మధ్యాహ్నం తుమ్మల గూడెం నుంచి రామన్నపేటకు వస్తుండగా మండల కేంద్రంలోని చేపల మార్కెట్ వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న సుభద్ర కింద పడింది. లారీ టైర్లు ఆమె తల మీది నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

రామన్నపేట, జనవరి 10 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బీజేపీ మండలాధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ బాలగోని నర్సింహ శుక్రవారం ప్రారంభించారు. ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

రామన్నపేట, జనవరి 10 : విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కే వైద్యులు శ్రీకాంత్, సైదా అన్నారు. మండలంలోని పల్లివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ టీమ్ కల్యాణి, శ్వేత, హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే పంచాయతీ ఎన్నికలను అడ్డుకుంటాం

- సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

రాజాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, జనవరి 10 : గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించకపోతే రాబోయే పంచాయతీ ఎన్నికలను అడ్డుకుంటామని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో వీధిలైట్ల నిర్వహణ, అంతర్గత మురుగు కాల్వలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, పల్లె ప్రగతి, తాగునీటి పథకాల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడం వల్ల మాజీ సర్పంచ్‌లు మనోవేదనకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనులకు చేసిన అప్పుల భారంతో అనేక మంది మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు పంబ కరుణాకర్, రాములు నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికలను అడ్డుకుంటాం : నాగయ్య

మోత్కూరు : పెండింగ్ బిల్లులను చెల్లించకుండా పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తే అడ్డుకుంటామని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిల్లుల కోసం పంచాయతీ అధికారులు ఎంబీ రికార్డులు చేసి ప్రభుత్వానికి నివేదించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 10 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో బ్యూటీషియన్ కోర్సుకు ఆసక్తి గల యువతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల కాలపరిమితి కలిగిన బేసిక్ కోర్సు, మూడు నెలల అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్సులు చేయడానికి పదో తరగతి అర్హత ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్, పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఈనెల 20న ఉదయం 10 గంటలకు సంస్థలో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు పట్టణంలో ముగ్గుల పోటీలు

భువనగిరి అర్బన్, జనవరి 10 : స్వచ్ఛ భారత్–స్వచ్ఛ తెలంగాణ–స్వచ్ఛ భువనగిరి కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంక్రాంతి పండగ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలతో పాటు 10 మందికి కన్సోలేషన్ బహుమతులు రూ.వెయ్యి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. పాల్గొన్న ప్రతి మహిళకు కూడా బహుమతిని అందించనున్నట్లు చెప్పారు.

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి : కాంగ్రెస్ నాయకులు

మోటకొండూర్, జనవరి 10 : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీర్ల అయిలయ్యను ఆయన విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ మల్లన్నపై పార్టీ పెద్దలు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులున్నారు.

షాట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

రాజాపేట, జనవరి 10 : ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరుగడంతో సామగ్రి దగ్ధమైన ఘటన మండలంలోని కుర్రారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కొత్తజాల గ్రామానికి చెందిన చెప్పాల కిష్టయ్య కుర్రారం గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటున్నాడు. ప్రమాదవశాత్తు ఇంట్లో షాట్ సర్క్యూట్ జరుగడంతో ఇంట్లో ఉన్న రూ.23 వేల నగదుతో పాటు, బియ్యం బట్టలు పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కిష్టయ్య వేడుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరు(ఎం), జనవరి 10 : మండలంలోని రాయిపల్లి స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదంలో శుక్రవారం వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రాయిపల్లి గ్రామానికి చెందిన దేవరబొయిన శ్రీను (52) ఆత్మకూరు(ఎం)లోని సిమెంట్ దుకాణంలో రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకొని తన టీవీఎస్ ఎక్సెల్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా భువనగిరి నుంచి ఆత్మకూరు(ఎం)వైపునకు వస్తున్న టాటాఏస్ వాహనం శ్రీను బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వీఆర్ఏ మృతి

రామన్నపేట, జనవరి10 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన వీఆర్ఏ కర్రి యాదగిరి గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం తాసీల్దార్ లాల్ బహదూర్ వీఆర్ఏ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా రూ.20వేలను యాదగిరి కుటుంబానికి అందించారు. తాసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాజాపేట పొట్టి డ్యామ్ నుంచి పారుతున్న కాళేశ్వరం జలాలు

పారుతున్న కాళేశ్వరం జలాలు

రాజాపేట, జనవరి 10 : కాళేశ్వరం 15 ప్యాకేజ్ ద్వారా గంధమల్ల చెరువు నిండి అలుగు పోస్తున్నది. దీంతో మండలంలోని బేగంపేట, కాల్వపల్లి మీదుగా కాళేశ్వరం జలాలు వాగులో నిండుగా ప్రవహిస్తున్నాయి. వాగులో ఉన్న మూడు చెక్ డ్యాములకు జలకళ సంతరించుకుంది. కాళేశ్వరం జలాలు వాగులో ప్రవహిస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగి యాసంగికి ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామన్నపేట మండల వాసికి డాక్టరేట్

వీరమళ్ల లింగస్వామి

రామన్నపేట, జనవరి 10 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ల లింగస్వామికి గౌరవ డాక్టరేట్ దక్కింది. మోకాలి కీలు దానిలో ఉన్న వివిధ లింగ్‌మెట్స్ మెనిస్కస్‌పై చేసిన పరిశోధనకు గాను డీవై పాటిల్ విద్యాపీఠ్ యూనివర్సిటీ పూణె గౌరవ డాక్టరేట్‌ను అందించినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. లింగస్వామిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

గ్యాస్ సిలిండర్ పేలడంతో దగ్ధమైన ఇంటి సామగ్రి

భువనగిరికలెక్టరేట్, జనవరి 10 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో భారీ ప్రమాదం తప్పింది. వివరాలు.. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన మచ్చ బాలరాజుగౌడ్ ఇంట్లో గురువారం రాత్రి అతడి కుమారుడు మచ్చ నవీన్ గౌడ్ గ్యాస్ సిలిండర్‌ను స్టవ్‌కు అమరుస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీశారు. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు నీటితో మంటలను అదుపుచేశారు. ఈక్రమంలో ఇంట్లో వంట సామగ్రితో పాటు దుస్తులు, నిత్యావసర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

ఆర్టీసీ అద్దె బస్సులకు రిప్లేస్‌మెంట్ కల్పించాలి : మధుకర్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మధుకర్‌రెడ్డి

చౌటుప్పల్, జనవరి 10 : ఆర్టీసీ అద్దె బస్సులకు ప్రభుత్వం రిప్లేస్‌మెంట్ అవకాశం కల్పించాలని ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్బ మధుకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎల్లగిరి రిక్కల సత్తిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బస్సు యజమానుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫ్రీ బస్సు పథకం ద్వారా భారమైనా ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవిస్తూ బస్సులను నడుపుతున్నామన్నారు. కానీ అద్దె బస్సుల కాలపరిమితి మూడు నెలల్లో ముగుస్తుందని, ఇంతకుముందు మాదిరిగానే రిప్లేస్‌మెంట్ అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మహిపాల్ రెడ్డి, కోశాధికారి సత్యంబాబు, నాయకులు ప్రభాకర్, యాదయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జ్ఞానంతోనే శాంతి స్థాపన

- రాజయోగి బీకే బృజ్మోహన్ భాయ్‌జి

స్పిరిచువల్ సర్వీస్ ట్రైనింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన బృజ్మోహన్ భాయ్‌జీ

బీబీనగర్, జనవరి 10 : సమస్యలు, రుగ్మతలను రూపుమాపి సుఖ శాంతులు నెలకొల్పడానికి ఆధ్యాత్మిక జ్ఞానమే ఏకైక ఆధారమని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సెక్రటరీ జనరల్ రాజయోగి బికే బృజ్మోహన్ భాయ్‌జి అన్నారు. బీబీనగర్ మండల పరిధిలోని మహదేవ్ పూర్ గ్రామంలో గల బ్రహ్మకుమారి సైలెన్స్ రిట్రీట్ సెంటర్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా స్పిరిచువల్ సర్వీస్ ట్రైనింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ జాయింట్ చీఫ్ రాజయోగిని బికే సంతోష్ దీదీజి, సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బీకే రాజ్ కుమారి, బీకే సునీత, టీచర్లు, బ్రహ్మకుమారి సభ్యులు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి'

మాట్లాడుతున్న ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల

భూదాన్‌పోచంపల్లి, జనవరి 10 : విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ నల్లగొండ ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల అన్నారు. మండలంలోని ముక్తాపూర్ చింతబావి గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ స్టేట్ ఆఫీసర్ నరసింహగౌడ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ హరిప్రసాద్, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల, కొంగరి కృష్ణ, మాజీ సర్పంచులు దారెడ్డి మల్లారెడ్డి, మునుకుంట్ల బాలచందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న కృష్ణ

భూదాన్‌పోచంపల్లి, జనవరి 10 : మండలంలోని ఇంద్రియాల జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బండి దయాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్ శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గురునాథం, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

పీఏసీఎస్‌ల బలోపేతానికి ఎంతో కృషి చేశా

- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి10 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి ఎనలేని కృషి చేశానని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వంగపల్లి రైతువేదికలో పీఏసీఎస్ సంఘం మహాజన సభను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన ప్రమాణ స్వీకార సమయంలో సహకార సంఘం రూ.2కోట్ల నష్టాల్లో ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో రూ.104 కోట్ల లాభాల్లోకి తెచ్చామన్నారు. లాభాల్లో రాష్ట్రంలోనే నల్లగొండ డీసీసీబీని రెండో స్థానంలో నిలిపినట్లు తెలిపారు. రైతులకు ఎక్కువ రుణాలను అందించాలనే ఉద్దేశంతో ఆత్మకూరు(ఎం), రాజాపేట, చీకటిమామిడిలలో నూతన పీఏసీఎస్‌లను ఏర్పాటు చేసేందుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో మోటకొండూర్‌లో కూడా ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వంగపల్లి పీఏసీఎస్ సీఈఓ భద్రారెడ్డి, ఆయా మండలాల పీఏసీఎస్ చైర్మన్లు రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, మల్లేశ్‌గౌడ్, బాలనర్సయ్య పాల్గొన్నారు.

వంగపల్లిలో పీఏసీఎస్ భవనం ప్రారంభం

- హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 10 : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. వంగపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 'సూపర్ బజార్' భవనాన్ని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. దీంతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, డైరెక్టర్లు బైండ్ల గౌరమ్మ, పన్నాల అనిత, కేతావత్ ఉపేందర్ నాయక్, వీరస్వామి, గడ్డమీది శ్రీనివాస్, దూసరి కిష్టయ్య, సింగిరెడ్డి సత్తిరెడ్డి, బొబ్బలి యాదిరెడ్డి, ఆరె రమేశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు ఇమ్మడి రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

మోటకొండూరులో ఈనెల 12న ఉచిత వైద్య శిబిరం

- మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత

మోటకొండూర్, జనవరి 10 : మండల కేంద్రంలో ఈ నెల 12 ఆదివారం జోడిమెట్ల నీలిమ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మోటకొండూర్ మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత అన్నారు. మండలంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నీలిమ హాస్పిటల్స్ ఉచిత వైద్య శిబిరాలను జనగాం జిల్లాలో మాత్రమే నిర్వహిస్తారని, తమ విన్నపంతో మన మండల కేంద్రానికి వస్తున్నారని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తారని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి 50శాతం రాయితీతో పాటు హెల్త్ కార్డులను ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాని సూచించారు. అదే విధంగా నీలిమ హాస్పిటల్స్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భువనగిరి టు ఉప్పల్‌కు బస్సు ప్రారంభం

భువనగిరి బస్టాండ్‌లో జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 10 : ప్రయాణికుల కోసం భువనగిరి నుంచి ఉప్పల్ వరకు కొత్త బస్సును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ బస్సును శుక్రవారం ఆయన భువనగిరి బస్టాండ్‌లో జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ నరాల నిర్మలావెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణ, మండలానికి చెందిన అర్హులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు.

వరి నాట్లు వేసిన వ్యవసాయాధికారులు

నెమిలే గ్రామంలో వరి నాట్లు వేస్తున్న వ్యవసాయాధికారులు

రాజాపేట, జనవరి 10 : మండలంలోని నెమిలే గ్రామంలో కౌలు రైతు వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారులు వరి నాట్లు వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పద్మజ మాట్లాడుతూ నాటు వేసే క్రమంలో నారు చివర కొనలు తుంచి వేయాలన్నారు. దీంతో చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు ప్రణీత, కవిత, అంజయ్య ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

అంబాల ఎంపీపీఎస్‌లో విద్యార్థులపై బోగి పళ్లు పోస్తున్న ఉపాధ్యాయులు

గుండాల, జనవరి 10 : మండలంలోని అంబాల ఎంపీపీఎస్‌లో శుక్రవారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సంక్రాంతి సంబురాలను జరిపారు. ఈ సందర్భంగా బోగి మంటలు వేసి విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులపై బోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలుగు లింగయ్య, ఉపాధ్యాయులు మాదరబోయిన నవ్య, బిర్రు శివకుమార్, అంగన్‌వాడీ టీచర్లు బాగ్యలక్ష్మి, వసుమతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

రాజాపేట, జనవరి 10 : మండలంలోని దూది వెంకటాపురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థినులకు శుక్రవారం భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆరు సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరిపె నర్సింగరావు, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు నరసింహాచారి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఎలేందర్‌రెడ్డి, కనకయ్య, మధు, విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి : ఎంఈఓ

బొమ్మలరామారం, జనవరి 10 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మండల విద్యాధికారి రోజారాణి అన్నారు. మండల కేంద్రంలోని రిసోర్స్ కేంద్రంలో శుక్రవారం ఆమె ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం వరలక్ష్మి, రాజ్‌కుమార్, శివనారాయణ, కోశాధికారి బాలరాజు పాల్గొన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

గుండాల : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం పీఆర్టీయూ డైరీని ఎంపీడీఓ జి.శంకరయ్య, ఎంఈఓ అగ్గిరాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ, ఎస్ఐ సైదులు, ఎంపీఓ ధనుంజయ్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు జంపాల రాజు, ప్రధాన కార్యదర్శి గొడుగు బాలరాజు పాల్గొన్నారు.